**మంచిమాట**

సంతోషం సీతాకోకచిలుక లాంటిది. అందుకోవాలని వెంటపడితే చిక్కకుండా ఎగిరిపోతుంది. మన పని మనం చేసుకుంటూ ప్రశాంతంగా కూర్చుంటే వచ్చి పైన వాలుతుంది.

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

శుక్రవారం, 26 డిసెంబర్ 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 49

# ఆర్టికల్ 370 రద్దు బీజేపీకి గర్వకారణం

**ఉత్తర్‌ప్రదేశ్ :** స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ అనుసరించిన విధానాలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ మహనీయులను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. ఆర్టికల్ 370 గోడను కూల్చడం బీజేపీకి గర్వకారణమన్నారు. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన మంచి పనులన్నీ ఒకే కుటుంబానికి ఆపాదించారని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్ లోని లఖ్‌నవూలో రాష్ట్రీయ ప్రేరణస్థల్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, క్రిస్మస్ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందం నింపాలన్నారు. అటల్‌జీ హయాంలోనే గ్రామగ్రామాన రోడ్ల నిర్మాణానికి బీజం పడిందన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. 2000 ఏడాది నుంచి గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో 8 లక్షల కి.మీ మేర రోడ్ల నిర్మాణం జరిగాయని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలోనే దాదాపు 4 లక్షల కి.మీ మేర గ్రామాల్లో రోడ్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. దేశంలో ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం మరింత



పుంజుకుందని, అటల్‌జీ హయాంలోనే ఢిల్లీలో మెట్రో ప్రారంభమైందని చెప్పారు. "శ్యామాప్రసాద్, దీన్‌దయాల్, వాజ్‌పేయీ విగ్రహాలు గొప్ప స్ఫూర్తి ఇస్తాయి. డిసెంబర్ 25న ఇద్దరు మహనీయులు జన్మించారు. వాజ్‌పేయీ, మదన్‌మోహన్ మాలవీయ భారత ఏకత్వానికి కృషి చేశారు. ప్రేరణస్థల్ ప్రజల ప్రతి అడుగు జాతి నిర్మాణం దిశగా ఉండాలనే సందేశం ఇస్తుంది. ప్రజలందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. నేతల విగ్రహాలు ఎంత ఎత్తు ఉన్నాయో వాటి వల్ల కలిగే ప్రేరణ అంత కంటే గొప్పది. శ్యామాప్రసాద్, దీన్‌దయాల్ కలల సాకారానికి సంకల్పం తీసుకోవాలి. ప్రపంచం మొత్తం బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం చూసింది. బ్రహ్మోస్ క్షిపణులు లఖ్‌నవూలోనే తయారవుతున్నాయి. లఖ్‌నవూలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. మొబైల్, ఇంటర్నెట్ వాడే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. 11 ఏళ్లలో భారత్ మరో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా మారింది. మొబైల్ ఫోన్లు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది."

## సింపతీ పెంచే కుట్ర సీఎం రేవంత్‌పై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, డిసెంబర్ 25:** సీఎం రేవంత్ రెడ్డి , మాజీ సీఎం కేసీఆర్ పై కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడ్నుతూ.. కేసీఆర్ మీద రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష సరైంది కాదన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు మాట్లాడే ముందు జాగ్రతగా మాట్లాడాలని.. అంతే కానీ ఇలా దిగజారి మాట్లాడితే ఆ పదవికి ఉన్న గౌరవం తగ్గుతుందని హితవు పలికారు. మాజీ సీఎంపై రేవంత్ రెడ్డి వాడిన భాష మీదే తెలంగాణలో తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. నీటి వాటాల అంశంలో తప్పు చేసిందే కేసీఆర్ అంటూ వ్యాఖ్యలు చేశారు.అప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిందని... నీటి పంపకాల అంశంలో అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలను అప్పుడు ఓ ఐఏఎస్ అధికారి ట్వీట్ చేశారని గుర్తుచేశారు. క ృషా? జలాల అంశంలో కేసీఆర్ తప్పుడు నిర?యాల వల్లే ఇందంతా జరిగిందని విమర్శించారు. అనేక సార్లు అఫెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ తప్పించుకున్నారన్నారు. కేసీఆర్‌ను రేవంత్ తిట్టడం వెనక సింపతీ పెంచే కుట్ర దాగి ఉందని... కానీ ఇందు కోసం మరీ ఇంత జుగుప్సకరమైన భాష అవసరం లేదన్నారు. తెలంగాణకు పట్టిన పెద్ద శని కేసీఆర్ కుటుంబమని అన్నారు. కేసీఆర్ శని కాబట్టే ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని కామెంట్స్ చేశారు.వారిద్దరు జైలుకెళ్లడం ఖాయం.రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. వారి మీద కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్ర మంత్రులు జైలుకు వెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు మీద కేంద్ర ప్రభుత్వం దగ్గర అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొంతమంది మంత్రులు వేల కోట్ల భుములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయట పెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్ క ృషా? జలాల అంశాన్ని కొత్తగా తెర మీదకు తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లాగే రేవంత్ రెడ్డి సర్కార్ ఉందన్నారు. అప్పుడు పథకాల అమలుపై ప్రజలు నిలదీస్తారని కేసీఆర్ కొత్త అంశాలను తెర మీదకు తెచ్చేవారని.. ఇప్పుడు రేవంత్ అదే డ్రామాను ఆడుతున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

## వాజ్‌పేయి ప్రసంగాలు, వ్యక్తిత్వం యువతకు మార్గదర్శకాలు

**హైదరాబాద్, డిసెంబర్ 25:** అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని , భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కేంద్రమంత్రి. అనంతరం మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కొనియాడారు.ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు. భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు.పాకిస్థాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు.



స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అనితెలిపారు. నేడు వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## నీట్, జేఈఈ అభ్యర్థులకు ఫేషియల్ వెరిఫికేషన్

**న్యూఢిల్లీ:** జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. 2026 నుంచి కీలక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఫేషియల్ బయోమెట్రిక్ ఆథెంటికేషన్, మ్యాండేటరీ లైవ్ ఫొటోగ్రాఫ్ వెరిఫికేషన్ నిర్వహించబోతున్నది. జేఈఈ (మెయిన్), నీట్-యూజీ వంటి పరీక్షలకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు ధ్రువీకరించారు.విస్తరించిన తనిఖీ పద్ధతులను అమలు చేసిన మొదటి పరీక్షగా 2026 జనవరిలో జరిగే జేఈఈ (మెయిన్) నిలుస్తుంది. పరీక్షల ప్రక్రియలో వివిధ దశల్లో అభ్యర్థులను ఎప్పటికప్పుడు అధికారికంగా ధ్రువీకరించుకోవడానికి ఈ విధానం దోహదపడుతుందని అధికారులు చెప్పారు. ఒకరికి బదులుగా వేరొకరు పరీక్షలు రాయడం, అనుచిత చర్యలకు పాల్పడటం వంటివాటిని నిరోధించవచ్చునని తెలిపారు.

## హరీష్ రావుపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్ :** హరీష్ రావు వైఖరిపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతున్న మాటలు వింటుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం హరీష్ రావుకే చెల్లిందని విమర్శించారు. ఎదుటివారికి నీతులు చెప్పడం మానేసి, ముందు తమ తప్పులు తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు.రాజకీయాల్లో సభ్యతను మరిచి, తిట్ల పురాణాన్ని మొదలుపెట్టిందే కేసీఆర్ అని చామల గుర్తు చేశారు. నాడు ముఖ్యమంత్రిగా ఉండి ప్రతిపక్షాలను, నాయకులను కించపరిచేలా మాట్లాడిన సంస్కృతి బీఆర్ఎస్ పార్టీదేనని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు గౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా హరీష్ రావు తన పద్ధతి మార్చుకోవాలని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని హెచ్చరించారు.రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేవలం ఫామ్ హౌస్‌కే పరిమితం కాకుండా, ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం మానేసి విమర్శలకే పరిమితం కావడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలే ముఖ్యం తప్ప, పారిపోవడం కాదని ఆయన స్పష్టం చేశారు.నీళ్లు మరియు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన నిజాలపై చర్చించేందుకు అసెంబ్లీయే సరైన వేదిక అని చామల పేర్కొన్నారు. కేసీఆర్ ధైర్యంగా సభకు వచ్చి తమ హయాంలో ఏం జరిగిందో చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్ర సమస్యలపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షాలు అర్థవంతమైన చర్చకు సహకరించాలని ఆయన కోరారు.




## టీఎస్ ఆర్టీసీలో కొలువుల జాతర

- 198 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల!



**హైదరాబాద్, డిసెంబర్ 25:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే తీపి కబురు అందించింది. తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లో ఖాళీగా ఉన్న కీలక పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు గురువారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 198 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో ట్రాఫిక్ విభాగంలో 84 పోస్టులు, మెకానికల్ విభాగంలో 114 పోస్టులు ఉన్నాయి.ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం భారీ జీతభత్యాలు అందనున్నాయి. నెలకు కనీసం రూ.27,080 నుంచి గరిష్టంగా రూ.81,400 వరకు జీతంతో పాటు ఇతర ప్రభుత్వ అలవెన్సులు కూడా లభిస్తాయి. ట్రాఫిక్ సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. మెకానికల్ సూపర్‌వైజర్ పోస్టులకు మాత్రం సంబంధిత ఇంజినీరింగ్ విభాగంలో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండటం తప్పనిసరి.ఎంపిక ప్రక్రియ విషయానికి వస్తే, అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఈ నియామకాలు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. రాత పరీక్ష, సిలబస్ మరియు ఇతర శారీరక సామర్థ్య పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 30, 2025 ఉదయం 8 గంటల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ జనవరి 20, 2026 సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.అర్హత ఉన్న అభ్యర్థులు చివరి నిమిషంలో వచ్చే సర్వర్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ముందుగానే అధికారిక వెబ్‌సైట్ సందర్శించి అప్లై చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆర్టీసీలో స్థిరపడాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశమని నిపుణులు చెబుతున్నారు.

## హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్

**హైదరాబాద్:** కొత్త ఏడాది వేడుకలు వస్తున్నాయంటే చాలు భాగ్యనగరంలో సందడి మామూలుగా ఉండదు. అయితే, ఈ ఆనందం విషాదంగా మారకూడదనే ఉద్దేశంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్పుడే రంగంలోకి దిగారు. డిసెంబర్ 31 వరకు నగరం అంతటా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. వేడుకల పేరుతో మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వారు స్పష్టం చేస్తున్నారు.తనిఖీలు మొదలుపెట్టిన తొలి రోజే ఏకంగా 304 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. నిబంధనలు ఉల్లంఘించిన వీరిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, వారి 304 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన జంక్షన్లు, పబ్బులు మరియు ఇతర రద్దీ ప్రాంతాల్లో పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. తాగి వాహనం నడిపి పట్టుబడితే భారీ జరిమానాలు, జైలు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని, కానీ అదే సమయంలో బాధ్యతను మర్చిపోవద్దని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మద్యం సేవించిన వారు డ్రైవింగ్ చేయకుండా క్యాబ్‌లు లేదా డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేయవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని కోరుతున్నారు.



## అమరావతిలో వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణ



**అమరావతి:** భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 101 జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఘన నివాళులర్పించారు. వెంకటపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కలిసి గురువారం ఆవిష్కరించారు. అట్టహాసంగా విగ్రహావిష్కరణఅటల్ జీ జయంతిని 'సుపరిపాలన దినోత్సవం'గా జరుపుకుంటున్న వేళ, అమరావతిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది 13 అడుగుల ఎత్తు కలిగిన అద్భుతమైన కాంస్య విగ్రహం. వాజ్‌పేయి నిలువెత్తు రూపాన్ని ప్రతిబింబించేలా దీనిని తీర్చిదిద్దారు.సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌లతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం నేతలు వాజ్‌పేయికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతవిగ్రహావిష్కరణ అనంతరం అటల్ జీ స్మృత్యర్థం విగ్రహ ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మొక్కలు నాటారు. అభివృద్ధికి ప్రాణం పోసిన అటల్ జీ జయంతి రోజున పచ్చదనాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.అటల్ జీ బాటలో అమరావతిఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. నవ భారతాన్ని నిర్మించడంలో వాజ్‌పేయి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. స్వర్ణ చతుర్భుజి వంటి ప్రాజెక్టులతో దేశాన్ని ఏకం చేసిన మహనీయుడి ఆశయాలకు అనుగుణంగానే రాజధాని అమరావతిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం సందర్శకులకు అటల్ జీ స్ఫూర్తిని గుర్తుచేస్తూ ఉంటుందని స్థానిక నేతలు అభిప్రాయపడ్డారు.

మెదక్ టుడే MEDAK TODAY తెలుగు దిన పత్రిక

శుక్రవారం, 26 డిసెంబర్ 2025

# కరుణామయుడు ఏసుక్రీస్తు

**- క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.**






**పటాన్చెరు డిసెంబర్ 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

కరుణామయుడు ఏసుక్రీస్తు బోధనలు, జీవితం ప్రతి ఒక్కరికి అనుసరనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మెథడిస్ట్ చర్చ్, పెంతెకోస్తూ చర్చిలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. విశ్వ శాంతి దూత, దేవుని కుమారుడు భూమి మీద అడుగు పెట్టిన శుభదినం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పరమత సహనం, దైవ చింతన అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, షకీల్, ఆయా చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

## సీఎస్ఈలో సిరువోరు వాహినికి పీహెచ్.డీ.



**పటాన్చెరు డిసెంబర్ 25 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని సిరువోరు వాహిని డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డీప్ న్యూరల్ నెట్ వర్క్ ఉపయోగించి క్లౌడ్ కంప్యూటింగ్ లో ఆప్టిమైజ్డ్ షెడ్యూలింగ్ కోసం ఇంటెలిజెంట్ లోడ్ బ్యాలెన్సింగ్'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అపర్ణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. పెద్దయెత్తున క్లౌడ్ వాతావరణంలో డైనమిక్ పనిభారాలను నిర్వహించడంలో కీలకమైన సవాళ్లను ఈ అధ్యయనం ద్వారా డాక్టర్ వాహిని పరిష్కరించినట్టు తెలిపారు. డీప్ లెర్నింగ్, రీఇన్ఫోర్స్మెంట్ పద్ధతులను ఉపయోగించి మూడు స్థాయిల తెలివైన లోడ్ బ్యాలెన్సింగ్ ఫ్రేమ్ వర్కును ప్రతిపాదించడం ద్వారా, పనిభార అంచనా, వనరుల వినియోగం, శక్తి సామర్థ్యం, సేవ యొక్క నాణ్యతను పెంచుతుందని వివరించారు. క్లౌడ్ సిమ్ ని ఉపయోగించే విస్తృతమైన అనుకరణలు ప్రతిస్పందన సమయం, శక్తి వినియోగం పనిభారంలో ఇప్పటికే ఉన్న విధానాల కంటే గణనీయమైన మెరుగుదలలను ప్రదర్శిస్తాయన్నారు. డాక్టర్ వాహిని సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల , అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మెదక్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు





**మెదక్ డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

మెదక్ పట్టణంలోని ప్రసిద్ధ మెదక్ చర్చ్‌లో పాస్టర్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పాల్గొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాంతి, సౌభ్రాతృత్వం, సమాజ హితం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభు యేసు క్రీస్తు ప్రేమ, త్యాగం, క్షమాభావం అనే మహోన్నత విలువలను ప్రపంచానికి అందించిన మహానుభావుడని తెలిపారు. యేసు క్రీస్తు బోధించిన శాంతి, సేవ, సోదరభావం నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆ ఆదర్శాలను ఆచరిస్తూ మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతియుత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం చర్చ్ ప్రాంగణంలో భక్తులతో సాదరంగా ముచ్చటించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం భక్తులలో ఆనందం, ఉత్సాహాన్ని నింపింది.

# పీవీ ఘాట్ వద్ద మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 21వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

**మెదక్ డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

పివి ఘాట్ వద్ద మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 21వ వర్ధంతి పూలమాలవేసి నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఆయన తనయుడు పీవీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, నరసింహారావు వారసత్వం కేవలం ఆయన అమలు చేసిన చారిత్రక ఆర్థిక సంస్కరణలకే పరిమితం కాదని, దేశ నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో విశాలమైనదని స్పష్టం చేశారు. ఆయనను ఒక కర్మయోగి, స్థితప్రజ్ఞుడుగా వర్ణించిన ప్రభాకర్ రావు, లోతైన మేధస్సు, అంతర్గత శాంతి, అపార సహనంతో దేశాన్ని కీలక మలుపులో నడిపించిన మహానాయకుడిగా నరసింహారావును స్మరించారు. నరసింహారావు బహుముఖ ప్రతిభను గుర్తు చేస్తూ, భూ సంస్కరణలు, విద్యా సంస్కరణల ప్రగతిలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రభాకర్ రావు తెలిపారు. సామాజిక సమానత్వం, జ్ఞాన సాధికారతే భారతదేశ దీర్ఘకాలిక అభివృద్ధికి మూలాధారమన్న నమ్మకంతో ఆయన ఈ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నవోదయ విద్యాలయాల విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని



పేర్కొన్నారు. విదేశాంగ విధానంలోనూ నరసింహారావు దూరదృష్టిని ప్రస్తావించిన ప్రభాకర్ రావు, ముఖ్యంగా లుక్ ఈస్ట్ పాలసీ ద్వారా దక్షిణాసియా దేశాలతో భారత సంబంధాలకు కొత్త దిశ చూపారని చెప్పారు. ఈ విధానం భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను బలోపేతం చేసిందని అన్నారు. అణు శక్తి, క్షిపణి సాంకేతికత రంగాల్లో భారత్ సాధించిన పురోగతికి కూడా నరసింహారావు వ్యూహాత్మక ఆలోచనలు, నిశ్శబ్దమైన కానీ దృఢమైన నిర్ణయాలే పునాది అని తెలిపారు. ఇవే జాతీయ భద్రతకు, సాంకేతిక స్వావలంబనకు మార్గం వేశాయని అన్నారు. "విద్యావంతతకు వినయం, ధైర్యానికి సమన్వయం, సంస్కరణలకు స్థిరత్వం కలగలిపిన నాయకత్వమే నరసింహారావు ప్రత్యేకత. నేడు మనం చూస్తున్న నూతన భారతంలో ఆయన ఆలోచనల ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది," అని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. ఈ స్మారక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్. వేణుగోపాల్ రావు, ఎస్. రాజయ్య, బీజేపీ చీఫ్ మీడియా ప్రతినిధి ఎన్.వి. సుభాష్, సీనియర్ జర్నలిస్ట్ మరియు తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ టీవైజేఎఫ్ అధ్యక్షుడు డా. జితేందర్ రావు తానుగుల, పీవీ శరత్, పి. సుశీల్ కుమార్, పీవీ మాధన్ మోహన్, పీవీ కిరణ్, ఎం. హరిబాబు, ఉదయ్ నాగరాజు తదితర ప్రముఖులు, పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. దేశ ప్రజాస్వామ్య, అభివృద్ధి ప్రయాణాన్ని మలిచిన దార్శనికుడు, సంయిమనంతో కూడిన సంస్కరణవాది అయిన పీవీ నరసింహారావుకు ఈ సభలో పాల్గొన్నవారు గంభీరంగా నివాళులు అర్పించారు.

# యేసు క్రీస్తు బోధనలు ఆదర్శనీయం

**- మానవాళికి క్రీస్తు శాంతి సందేశం స్ఫూర్తిదాయకం..**
**- నీలం మధు ముదిరాజ్**
**- ఘనంగా క్రిస్మస్ వేడుకలు**
**- ఘన స్వాగతం పలికిన నిర్వహకులు**
**- వికలాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన నీలం**








**పటాన్చెరు డిసెంబర్ 25 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం, అనుసరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్ పరిధిలోని బ్యులా, ఎంవీ చర్చిలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి వికలాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడిగా ప్రజల మధ్యనే నడయాడి సమాజానికి శాంతి సందేశం అందించిన దయామయుడు యేసుక్రీస్తు అని కొనియాడారు. క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయా గుణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో బ్యూలా చర్చి నిర్వాహకులు ప్రకాష్ రావు, రాజ్యలక్ష్మి, ఎంవీ చర్చి నిర్వాహకులు శ్రీమాన్, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు రవి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, రాజ్ కుమార్, గౌరి శంకర్, అనిల్, నిర్వాహకులు, క్రైస్తవ నాయకులు,సోదర,సోదరీమణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని పలు కాలనీల్లో క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు.

**- ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షులు శశిధర్ రెడ్డి పాల్గొని క్రైస్తవ సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు.**






**అమీన్పూర్ డిసెంబర్ 25 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలో జవహర్ నగర్ కాలనీలో డేవిడ్ పాస్టర్, శ్రీరామ్ నగర్ కాలనీలో జై కుమార్ పాస్టర్, ఎన్టీఆర్ కాలనీలో జేమ్స్ పాస్టర్, బీరంగుడలో జగన్ పాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాల సమైక్యతే సమాజ అభివృద్ధికి మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, శ్రీకాంత్, ఈశ్వర్ రెడ్డి, రామ్ చెందర్ రెడ్డి, లక్ష్మి నారాయణ, కృష్ణ యాదవ్,అనంతరం పిల్లలతో కలిసి కేక్ కటింగ్ చేసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

**- క్రిస్మస్ శాంతి ప్రేమ కరుణకు ప్రతీక.**
**- యేసు చూపిన బాటలో నడుచుకోవాలి.**
**- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి.**







**మెదక్ డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ,కరుణ త్యాగం మానవీయ విలువలకు ప్రతీక అని,యేసు చూపిన బాటలో అందరూ నడుచుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం . పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మెదక్ సీఎస్ఐ చర్చిలో ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్, పాస్టర్ శాంతయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ళ మల్లికార్జున్ గౌడ్ స్థానిక కౌన్సిలర్ జయరాజ్, నాయకులతో కలిసి పద్మ దేవేందర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చర్చి మెదక్ ఉండడం మనందరికీ గర్వకారణం అన్నారు. శత్రువులను సైతం ప్రేమతో క్షమించాలని సూచించిన ప్రేమమూర్తి యేసు ప్రభువు అన్నారు. ప్రేమ,దయ,కరుణ, జాలి గుణాలతో జీవించాలని, ప్రభువు సూచించిన మార్గంలో నడుచుకుందామన్నారు. అనంతరం చర్చి పాస్టర్ శాంతయ్య ఆధ్వర్యంలో పద్మాదేవేందర్ రెడ్డి, శేరి.సుభాష్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలోని ప్రధాన ద్వారం వద్ద పద్మాదేవేందర్రెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి సెక్రెటరీ గెలెన్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయరాజ్,ఆర్కే. శ్రీనివాస్,విజయలక్ష్మి,మాయ మల్లేశం, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, కో కన్వీనర్లు కృష్ణ గౌడ్ లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, నాయకులు ఏనుగుల.రాజు, మహమ్మద్, లక్ష్మీనారాయణ, నర్సింలు, మోహన్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, రుక్మాచారి,అనుప్,బబ్లు, కిరణ్, చాంద్ పాషా, భువన్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ చర్చిలో క్రిస్మస్ బందోబస్తును పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు





**మెదక్ డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** గురువారం రోజు మెదక్ పట్టణంలోని ప్రసిద్ధ మెదక్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు స్వయంగా పరిశీలించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు చర్చ్‌కు తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా చర్చ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. చర్చ్ ప్రాంగణం, ప్రధాన ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు, పరిసర రహదారులపై నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అలాగే మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగ వాతావరణంలో ప్రజలు శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, రంగ ణ్ణ, అలాగే ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావును కలిసిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్వేత కిరణ్ గౌడ్

**మెదక్.. హవేలీ ఘనపూర్ మండలం డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** గురువారం రోజు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు ఘనపురం మండలం కు వచ్చిన సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన హవేలీఘన్పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్వేతా కిరణ్ గౌడ్ హనుమంతరావుకు శాలువాతో సన్మానం చేయడం జరిగింది హనుమంతరావు శ్వేతా కిరణ్ గౌడ్ ని అభినందించారు కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకంతో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా ఎన్నుకున్న మీకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మరియు నేను హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెదక్ నియోజకవర్గం కు నిధులు విడుదల చేపించి అభివృద్ధి బాట లో కొనసాగాలని గ్రూప్ రాజకీయాలకు సహించలేదని అందరి సహకారంతో మెదక్ నియోజకవర్గంలో మరియు హవేలు గన్ పూర్ మండలం ను అభివృద్ధి బాటలో నడిపించాలని వారు కోరారు బీరప్ప కళ్యాణోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేసిన కుచన్పల్లి ఉపసర్పంచ్ రేఖమయ్య ఈనెల 26న సోమవారం నుండి దేవునికుచనిపల్లి గ్రామంలో జరుగు బీరప్ప కళ్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావును కలిసి ఆయనకు పత్రికను అందజేశారు అనంతరం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్వేతా కిరణ్ గౌడ కు మరియు రేఖమాయ్యా కు హనుమంతరావు శాలువా తో సన్మానించి అభినందించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్కరు శ్రీనివాస్ శేరి మహేందర్ రెడ్డి బాలకిషన్ రావు అరుణర్తి వెంకటరమణ నోముల శ్రీకాంత్ లింగాల సంతోష్ చినురి రాంరెడ్డి నాగమల్లయ్య కాంగ్రెస్ పార్టీ సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# వడియారం హేర్మన్ చర్చ్ ప్రాగణంలో యేసుక్రీస్తు జన్మదిన వేడుకలు

**చేగుంట డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం వడియారం గ్రామంలో హెర్మాన్ చర్చి లో పాస్టర్ హేంద్రి పాల్ ఆధ్వర్యంలో యేసుక్రీస్తు యొక్క జన్మదిన వేడుకలు ఘనంగా జరుపబడినవి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వడియారం గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ పాలకవర్గ సభ్యులు,సర్పంచ్ మాట్లాడుతూ ఈ కిస్మస్ వేడుకలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.చర్చిలో కొన్ని సమస్యలు పాస్టర్ నాకు చెప్పారు నేను పాలకవర్గంలో చర్చించి అన్ని సమస్యలు తీరుస్తాను అని అన్నారు. పాస్టర్ హేంద్రి పాల్ మాట్లాడుతూ కిస్మస్ సంబరాలు అంటే ప్రేమ శాంతి సంతోషాలతో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ చెట్లు అలంకరించడం బహుమతులు ఇచ్చి పూసుకోవడం, కేకులు కట్ చేయడం చిన్నపిల్లలకు గిఫ్ట్ ఇవ్వడం ఇలా సంబరాలు చేసుకుంటాం ఏసుక్రీస్తు యొక్క జన్మదినం ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25న ఘనంగా జరుపుకుంటాము. ఏసుక్రీస్తు మానవుని రక్షణ కొరకై పప్పీలు నీకేతమై ఆయన మరణించడానికి ఈ లోకానికి వచ్చావు చిన్న పశు వుల పాకలో జన్మించాడు మా కోసం ఆ దేవుడు ఇంతగా ప్రేమిస్తున్నాడు అని సంతోషంలో ఈ క్రిస్మస్ పండుగను జరుపుకుంటున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వడియారం గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్, పాలకవర్గ సభ్యులు చర్చి పాస్టర్ హేంద్రి పాల్ అక్కడికి వచ్చిన వివిధ గ్రామాల భక్తులు పాల్గొనడం జరిగింది.







# సాంట వేషాన్ని ధరించి డ్రగ్స్ పై అవగాహన కల్పించిన వ్యక్తి




**మెదక్ డిసెంబర్ 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** గురువారం రోజు మెదక్ పట్టణంలోని ప్రసిద్ధ మెదక్ చర్చ్ ప్రాంగణంలో సాంటా వేషాన్ని ధరించి డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యక్తిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ అడగగా, తన ప్రాణ స్నేహితుడు మత్తు పదార్థాలకు బానిసై ప్రాణాలు కోల్పోయిన బాధాకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, అందుకే సమాజంలో ముఖ్యంగా యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆ వ్యక్తి వివరించాడు.డ్రగ్స్ వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం ఎలా నష్టపోతుందో ప్రజలకు తెలియజేయడమే తన ఉద్దేశమని ఆయన తెలిపారు. సాంటా వేషం ధరించడం ద్వారా పిల్లలు, యువత దృష్టిని ఆకర్షించి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి మత్తు పదార్థాల ప్రమాదాలను వివరించగలుగుతున్నానని చెప్పాడు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అతని ప్రయత్నాన్ని అభినందిస్తూ, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే డ్రగ్స్ నిర్మూలనలో పోలీస్ శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ అన్నారు.

# తెల్లాపూర్ జ్యోతిబాపులే కాలనీలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళను, బాలున్ని హత్య చేసిన వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.






**రామచంద్రపురం డిసెంబర్ 25 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్ జ్యోతిబాపులే కాలనీలో మహబూబ్ నగర్ కు చెందిన చంద్రకళ (30), రేవంత్ కుమార్ (15), వనపర్తికి చెందిన శివరాజ్ భార్యభర్తలుగా ఐదు రోజుల క్రితం అద్దె ఇంట్లో ఉండేందుకు వచ్చారు. శివరాజ్, చంద్రకళ లివింగ్ రిలేషన్ లో ఉన్నట్టు సమాచారం. చంద్రకళ, రేవంత్ హత్యకు గురై రక్తపు మడుగులో ఓ బెడ్ రూంలో పడి ఉండగా శివరాజ్ గొంతు కోయబడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. శివరాజ్ ను నల్లగండ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. హత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని కొన్ని ఆధారాలను సేకరించారు. ఎవరైనా హత్య చేశారా...లేదా శివరాజ్ తల్లీ కొడుకును హత్య చేసి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారా అనే కోణంలో విచారిస్తున్నారు.

# మారణాయుధాలతో రౌడీషీటర్లు!

**(మెదక్ టుడే)** : నగరంలోని పాతబస్తీలో బుధవారం తెల్లవారుజామునే పోలీసుల హల్‌చల్.. రెయిన్‌బజార్ ఏరియాలో ఓ ప్రాంతంలోని ఇండ్లల్లో పోలీసుల సోదాలు.. ఏం జరుగుతుందోనంటూ భయంభయంగా చూస్తున్న స్థానికులు.. అప్పటికే 40 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ జాఫర్‌పహిల్వాన్ ఇంటివద్ద పెద్ద ఎత్తున పోలీసుల మోహరించి ఆయన ఇంట్లో సోదాలు చేశారు.ఇటీవల ఆ ప్రాంతంలో జరిగిన ఒక హత్యకేసులో నిందితులు ఇద్దరు జాఫర్ ఇంట్లో ఉన్నారన్న సమాచారంతో పోలీసులు ఈ సోదాలు చేపట్టగా అక్కడ కొన్ని మారణాయుధాలు లభించాయి. అక్కడి నుంచి మాజీ రౌడీషీటర్ సయీద్ పహిల్వాన్, సులేమాన్ పహిల్వాన్ ఇండ్లల్లో తనిఖీలు చేసి అక్కడ కూడా మరికొన్ని మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ సోదాలు ఆ ప్రాంతంలో కలకలం రేపాయి. ముఖ్యంగా ఈ ముగ్గురు పహిల్వాన్లు పరారీలో ఉండడంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు.పోలీసుల సోదాల్లో మారణాయుధాల స్వాధీనంశాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాలు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని దక్షిణ మండల పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటా బ్రిడ్జ్ వద్ద ఈ నెలలో జునైద్ అనే వ్యక్తిపై వారి సమీప బంధువులు దాడిచేసి హతమార్చారు. అందులో 11 మంది నిందితులను గుర్తించి వారిలో 9 మందిని ఇప్పటికే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తకరలించామని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు కుల్సుంబేగం, రహీగౌస్‌లు ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా కొనసాగుతున్న జాఫర్ పహిల్వాన్ ఇంటిలో ఆశ్రయం పొందినట్లు సమాచారం అందడంతో అతని ఇంటిలో బుధవారం సోదాలు నిర్వహించామని ఇన్‌స్పెక్టర్ నేతాజి తెలిపారు. అతని ఇంటిలో 2 కత్తులతోపాటు ఓ గొడ్డలిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.జాఫర్ పహిల్వాన్ సమీప బంధువులైన సయీద్, సులేమాన్‌ల ఇండ్లల్లోనూ సోదాలు నిర్వహించగా 6 కత్తులు, రెండు గొడ్డళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సోదాల్లో పలుచోట్ల వివాదాస్పదమైన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు దొరికాయని, వాటిపై ప్రస్తుతం విచారణ జరుగుతున్నదని తెలిపారు. హత్య కేసుతో సంబంధమున్న నిందితులతోపాటు ఈ ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని నేతాజీ తెలిపారు. ఈ సోదాల్లో దక్షిణ మండల పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బంది మొత్తం 60 మంది పాల్గొన్నారని తెలిపారు. నిర్మాణాలు చోటుచేసుకుంటున్న వారిని టార్గెట్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడినా, మామూళ్ల కోసం వేధించినా వదిలే ప్రసక్తే లేదని రెయిన్ బజార్ ఇన్‌స్పెక్టర్ నేతాజీ హెచ్చరించారు.హద్దు దాటితే కఠినచర్యలు: సీపీ సజ్జనార్‌గతనెల చివరివారంలో లంగర్‌హౌస్, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రౌడీషీటర్లు వారు చెప్పిన అడ్రస్సుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు. వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలిపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి మానాలని, ఒకవేళ ఏదైనా నేరాలకు పాల్పడినా, బెదిరింపులకు దిగినా కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీడీయాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఇదే క్రమంలో ప్రస్తుతం నగరంలో రౌడీషీటర్ల వ్యవహారంపై ఆయన సీరియస్‌గా ఉన్నారు. పాత నేరస్తుల చరిత్రను పరిశీలించి వారి ప్రస్తుత జీవన విధానంపై తనకు రిపోర్ట్ ఇవ్వాలని ఎస్‌హెచ్‌వోలను ఆయన ఆదేశాలు జారీచేశారు. ఇటీవల జరిగిన హత్యలు, బెదిరింపుల వంటి ఘటనల్లో పాల్గొన్న రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని వారిపై సీరియస్ కేసులు నమోదు చేయాలని సజ్జనార్ చెప్పారు.

# ఎన్‌కౌంటర్ ఇద్దరు మావోయిస్టులు మృతి

**భువనేశ్వర్, డిసెంబర్ 25:** ఒడిశా కంధమాల్ జిల్లా బెలెర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మా అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ ఒడిశా స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ () నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో కూంబింగ్ నిర్వహించారు. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టి.. ఎస్‌ఓజీ పోలీసుల మీదకు కాల్పులు జరిపారు. దాంతో వారు సైతం ఎదురు కాల్పులకు దిగారు. ఇరువైపులా హెూరాహెూరీగా కాల్పులు జరిగాయి.

ఈ ప్రాంతంలో రెండు మృతదేహాలను భద్రతా సిబ్బంది కనుగొన్నారు. మృతులు ఏసీఎం బారి అలియాస్ రాకేష్ రాయ్‌గడ్ ప్లాటూన్ సభ్యుడు అమృతగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో మరిన్ని మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉందని ఎస్‌ఓజీ సిబ్బంది పేర్కొంటున్నారు. దేశంలో



మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్రం ఆపరేషన్ కగార్ అమలు చేస్తోంది. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలతోపాటు స్థానిక పోలీసులు కూంబింగ్ ద్వారా దండకారణ్యంలో జల్లెడపడుతున్నారు. ఈ నేపథ్యంలో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మరణించారు. వేలాది మంది అరెస్ట య్యారు. పలువురు సీనియర్ మావోయిస్టులు సైతం లొంగిపోయారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లో నిరంతరాయం గా కూంబింగ్ జరుగుతోంది. దీంతో మావోయిస్టులు సరిహద్దులోని రాష్ట్రాలకు తరలి పోతున్నారు. అలా ఒడిశాలోకి భారీగా మావోయిస్టులు చొరబడ్డారు. మరోవైపు లొంగిపోయే మవోయిస్టులకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అందిస్తున్న నజరానా కంటే.. 10 శాతం అధికంగా ఇస్తామని ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కేవలం కొన్ని గంటల్లోనే 22 మంది మావోయిస్టులు మల్కాన్‌గిరి జిల్లా పోలీసులు ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా వారందరికి కలిపి రూ. 2 కోట్ల మేర రివార్డును అందజేశారు.

2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కేంద్ర తీసుకుంటున్న పటిష్టమైన చర్యల వల్ల మావోయిస్టులు దాదాపుగా తగ్గిపోయారు.

# నిన్ను పెళ్లి చేసుకుంటాను కానీ నాకు పాకిస్థాన్‌ను కట్నంగా ఇవ్వాలి

**ఢిల్లీ:** అద్భుతమైన వాగ్దాటి కల్గిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. వాజ్‌పేయి జీవితంలోని ఒక మరపురాని సంఘటనను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా ఒక పాకిస్థాన్ మహిళ వేసిన వివాహ ప్రతిపాదనకు వాజ్‌పేయి తనదైన శైలిలో ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాశ్మీర్ అడిగిన మహిళ.. పాకిస్థాన్‌నే కోరిన అటల్! ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి పాకిస్థాన్ పర్యటనలో ఉన్నప్పుడు ఎదురైన ఆసక్తికర అనుభవాన్ని పంచుకున్నారు. వాజ్‌పేయి అనర్గళ ప్రసంగాలకు ముగ్ధురాలైన ఒక పాకిస్థాన్ మహిళా జర్నలిస్ట్.. ఆయన వద్దకు వచ్చి ఒక వింత ప్రతిపాదన పెట్టింది. "నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను.. కానీ దానికి బదులుగా మీరు మాకు కశ్మీర్‌ను ఇచ్చేస్తారా?" అని ఆమె



ప్రశ్నించింది. దానికి అటల్ జీ ఏమాత్రం తడబడకుండా చిరునవ్వుతో స్పందిస్తూ.. "నేను నిన్ను పెళ్లి చేసుకోవడానికి సిద్ధమే.. కానీ నాకు కట్నం కింద మొత్తం పాకిస్థాన్ కావాలి" అని బదులిచ్చారు. ఈ దెబ్బతో ఆ మహిళ నోరు మూతపడటమే కాకుండా.. కాశ్మీర్ విషయంలో భారతదేశం ఎంత కచ్చితంగా ఉందో ఆయన తన వాక్చాతుర్యంతో స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులను కూడా ఆకట్టుకునేలా, హుందాతనం కోల్పోకుండా విమర్శలు చేయడంలో వాజ్‌పేయికి ఆయనే సాటి అని రాజ్‌నాథ్ కొనియాడారు. వాజ్‌పేయి కేవలం రాజకీయ నాయకుడే కాదు.. ఒక గొప్ప కవి, రచయిత కూడా. ఆయన నాలుకపై సాక్షాత్తు సరస్వతీ దేవి కొలువై ఉంటుందని బీజేపీ కార్యకర్తలు నమ్ముతుంటారు. పార్లమెంటులో ఆయన ప్రసంగం మొదలైతే ప్రత్యర్థులు సైతం మౌనంగా వినాల్సిందే. తన జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్న వాజ్‌పేయి.. తన కాలేజీ మిత్రురాలైన రాజ్‌కుమారి కౌల్ కుమార్తె నమితను దత్తత తీసుకున్నారు. ఆయన మరణానంతరం అంత్యక్రియలను సైతం నమితా కౌలే నిర్వహించి ఒక గొప్ప కూతురిగా తన బాధ్యతను నెరవేర్చారు. పార్టీ విస్తరణను చూసి "నా కుటుంబం పెద్దదవుతోంది" అని మురిసిపోయిన మహెూన్నత నేత ఆయన. నేడు ఆయన జయంతి వేడుకల సందర్భంగా దేశం ఆ మహనీయుని స్మరించుకుంటోంది.

# ఇకపై సైనికులూ ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు రక్షణశాఖ అనుమతి

**ఢిల్లీ:** భారత సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వినియోగించడంపై కఠిన వైఖరి అవలంబిస్తూ వస్తున్న భారత రక్షణ శాఖ .. తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించినట్లు సమాచారం. ఇక నుంచి సైనికులు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటం కిస్తూ పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు వెల్లడించాయి. అయితే ఇన్‌స్టా వినియోగానికి అనుమతించినా అందుకు కొన్ని షరతులు కూడా విధించినట్లు తెలుస్తోంది. తాజా సవరణలకు సంబంధించి అన్ని సైనిక యూనిట్లకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ మార్గదర్శకాలు పంపించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించాలని, పోస్టులు చేయడం, కామెంట్లు పెట్టడం, షేరింగ్, మెసేజ్‌లకు రియాక్ట్ అవడం



వంటివి చేయకూడదనే కఠిన ఆంక్షలు మార్గదర్శకాల్లో ఉన్నట్లు తెలిసింది. అంటే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించవచ్చు కానీ.. అందులో ప్రతిస్పందించేందుకు అనుమతి ఉండదు. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ లాంటి ఇతర మాధ్యమాలకు కూడా ప్రస్తుతం అమల్లో ఉన్నాయి. సైనికులు, సైనికాధికారులు తమ ఖాతాల్లో తప్పుదోవ పట్టించే పోస్టులు, నకిలీ సమాచారం ఉన్నట్లయితే వాటిని తక్షణమే సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రక్షణ శాఖ మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు సమాచారం. వీపీఎన్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వెబ్ ప్రాక్సీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపయోగించవద్దని సైనికులను మరోసారి హెచ్చరించారు. డిజిటల్ అవగాహన, దేశ భద్రత మధ్య సైనికులు సమతూకంగా ఉండాలని ఈ మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. సైనికులు సోషల్ మీడియాను వినియోగించడంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయనున్నట్లు డిఫెన్స్ మినిస్ట్రీ తెలిపిందని మీడియా కథనాల్లో పేర్కొన్నారు.

# ల్యాబ్‌లో ప్రయోగాలు చేసే 'ఏఐ' ఏజెంట్ – ఐఐటీ పరిశోధకుల ఆవిష్కరణ

**ఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ)తో పనిచేసే సెర్చ్ ఇంజిన్ 'ఛాట్ జీపీటీ' గురించి మనకు తెలుసు. దాన్ని మనం ప్రశ్నలు అడుగుతుంటే సమాధానాలు ఇస్తుంటుంది. ఒకవేళ ఏదైనా భౌతికమైన పనిని చేయమని 'ఛాట్ జీపీటీ'కి చెబితే ఏమవుతుంది ? ఆ పనిని అది అస్సలు చేయలేదు. ఈ లోపాన్ని అధిగమించే దిశగా ప్రపంచంలోనే తొలిసారిగా ఐఐటీ ఢిల్లీకి చెందిన పరిశోధకులు ముందడుగు వేశారు. లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అనే సాఫ్ట్‌వేర్‌తో ఏఐ సెర్చ్ ఇంజిన్లు పనిచేస్తుంటాయి. మన పరిశోధకులు దాదాపు ఏడాది పాటు శ్రమించి ప్రాంప్ట్ ఇవ్వగానే భౌతికమైన పనులనూ చేయగల లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్‌ను ఆవిష్కరించారు. దీనికి 'ఐలా' (ఏఐఎల్ఏ) అని పేరు పెట్టారు. ఇది ల్యాబ్‌లో అచ్చం ఒక సైంటిస్టులా పనిచేస్తూ, అత్యంత క్లిష్టమైన మైక్రోస్కోపులతో మెటీరియల్స్ సైన్స్ టెస్టులు, ప్రయోగాలను నిర్వహిస్తోంది. ఐలాను ఎలా అభివృద్ధి చేశారు ? ఇది ఏయే పనులు చేయగలదు ? ఎంత కచ్చితత్వంతో చేయగలదు చిన్నతరహా యూనివర్సిటీలు, ఆస్పత్రులు, ఎంఎస్ఎంఈలకు దీనివల్ల ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది ఈ కథనంలో తెలుసుకుందాం. ఏఐ విప్లవానికి 'ఐలా'తో కొత్తబాటఐఐటీ దిల్లీలోని యార్డీ స్కూల్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన పరిశోధకులు సత్తా చాటారు. ఏఐ విప్లవాన్ని కొత్త పుంతలు తొక్కించే సరికొత్త బాటను వారు కనుగొన్నారు. ఐఐటీ దిల్లీలోని స్కూల్ ఆఫ్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్‌లోని పీహెచ్‌డీ స్కాలర్ ఇంద్రజీత్ మండల్, యార్డీ ఏఐ స్కూల్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎన్.ఎం. అనూప్ కృష్ణన్, మెటీరియల్స్ సైన్స్ ప్రొఫెసర్ నిత్యానంద్ గోస్వామి, పరిశోధకులు జితేంద్ర సోని, జాకిలతో కూడిన టీమ్ 'ఐలా' (ఏఐఎల్ఏ) అనే ఏఐ ఏజెంట్‌ను అభివృద్ధి చేసింది. 'ఐలా' అంటే 'ఆర్టిఫీషియల్లీ ఇంటెలిజెంట్ ల్యాబ్




అసిస్టెంట్' అని అర్థం. దీన్ని తయారు చేసిన టీమ్‌లో డెన్మార్క్‌కు చెందిన ఆల్బోర్గ్ యూనివర్సిటీకి చెందిన మోర్టెన్ ఎం స్మెడ్‌స్కెర్, జర్మనీలోని లీబ్నిజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోటోనిక్ టెక్నాలజీకి చెందిన కాట్రిన్ వోంద్రాజెక్, జర్మనీలోని జెనా విశ్వవిద్యాలయానికి చెందిన లోథర్ వోంద్రాజెక్ కూడా ఉన్నారు. 'ఐలా' ఏం చేస్తుంది ?మెటీరియల్ సైన్స్‌కు సంబంధించిన ల్యాబ్‌లో ప్రయోగాలు చేయడం అంటే ఆషామాషీ విషయం కాదు. ఇందుకోసం నిపుణులకు చాలా ఓపిక, ఏకాగ్రత, శ్రద్ధ అవసరం. మెటీరియల్ సైన్స్ ప్రయోగాలకు మూలస్తంభం అత్యాధునిక 'ఆటమిక్ ఫోర్స్ మైక్రోస్కోప్' (ఏఎఫ్ఎం). ఇన్నేళ్లు శ్రమించి నిపుణుడిగా మారిన వ్యక్తి కూడా, ఈ మైక్రోస్కోప్‌ను టెస్టు/ప్రయోగం కోసం సిద్ధం చేసుకోవడానికి గంటల కొద్దీ టైం తీసుకుంటాడు. ఇకపై ఇంత టైం వేస్ట్ కాదు. 'ఐలా' ఏఐ ఏజెంట్‌ను 'ఆటమిక్ ఫోర్స్ మైక్రోస్కోప్'తో లింక్ చేశాక, నిపుణుడు ఒక్క ప్రాంప్ట్‌ను ఇస్తే చాలు. ఆ వెంటనే ప్రయోగానికి/టెస్టుకు అవసరమైన కోడ్‌ను ఐలా రాస్తుంది. తనతో కనెక్ట్ అయి ఉన్న మైక్రోస్కోపును ఆపరేట్ చేయడం మొదలుపెడుతుంది. ప్రయోగం/టెస్టు పూర్తయ్యాక, అందులోని డేటాను సైతం తానే సేకరిస్తుంది. ఆ డేటా ప్రకారం వెల్లడయ్యే ఫలితాలను స్వయంగా విశ్లేషిస్తుంది. ఫలితంగా నిపుణుల శ్రమ తగ్గుతుంది. విలువైన టైం, డబ్బు ఆదా అవుతాయి. 100 ప్రయోగాల్లో 80 సక్సెస్"ఐలా ఏఐ ఏజెంట్‌ను ఆటమిక్ ఫోర్స్ మైక్రోస్కోప్‌తో లింక్ చేసి మేం గత ఏడాది వ్యవధిలో దాదాపు 100 విభిన్న ప్రయోగాలు చేశాం. వాటిలో 80 ప్రయోగాలు సక్సెస్ అయ్యాయి. విభిన్న రకాల లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్‌లను ఉపయోగించి ఐలా పనితీరును అంచనా వేశాం. ఐలా స్వయంప్రతిపత్తితో పనిచేయగలదని మా ప్రయోగాల్లో తేలింది. ఐలా ఏఐ ఏజెంట్‌లోని సాఫ్ట్‌వేర్‌లో దాదాపు 4వేల పేజీల మాన్యువల్‌లు ఉన్నాయి. మనం ప్రాంప్ట్ ఇవ్వగానే, అది మాన్యువల్‌లోని అన్ని నిబంధనలను చదువుతుంది. ఆ తర్వాతే ప్రయోగాన్ని/టెస్టును మొదలుపెడుతు ంది. అచ్చం ఒక సైంటిస్టులా బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా ప్రయోగంలోని ఒక్కొక్క స్టెప్‌ను పూర్తి చేస్తుంది. ప్రయోగం నిర్వహించే క్రమంలో ఏదైనా అనుమానం వస్తే, వెంటనే నిపుణుడికి తగిన సూచనలను పంపుతుంది. ఆ సూచనలను బట్టి నిపుణుడు సముచిత ప్రాంప్ట్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా ఆ ప్రయోగంలో భాగంగా ఉన్న విలువైన పరికరాలు దెబ్బతినే ముప్పు తప్పుతుంది. ఆటోమేషన్ టెక్నాలజీ ద్వారా 'ఆటమిక్ ఫోర్స్ మైక్రోస్కోప్'తో ఏదైనా టెస్ట్ నిర్వహిస్తే ఫలితాలు తప్పుగా వచ్చే అవకాశాలు ఉంటాయి. ఎందుకంటే ఆటోమేషన్ టెక్నాలజీలో ప్రయోగ నిర్వహణ నిబంధనలు ముందస్తుగా నిర్ణయమై ఉంటాయి. కానీ ఐలా ఏఐ ఏజెంట్ ప్రయోగం జరిగే క్రమంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా ఒక మనిషిలా అప్పటికప్పుడు స్పందిస్తుంది. అందుకే ఇది విశ్వసనీయమైన, కచ్చితమైన ఫలితాలను ఇవ్వగలదు" అని ఐఐటీ దిల్లీలోని స్కూల్ ఆఫ్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్‌లోని పీహెచ్‌డీ స్కాలర్ ఇంద్రజీత్ మండల్ తెలిపారు.

# షేక్ హసీనాకు షాకిచ్చిన యూనస్ సర్కార్

**బంగ్లాదేశ్:** బంగ్లాదేశ్‌రాజకీయాల్లో సంచలనాలు నమోదవుతున్నాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో 2026 ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఆ పార్టీకి లేదని యూనస్ సర్కార్ స్పష్టం చేసింది. పార్టీ కార్యకలాపాలపై ఉన్న నిషేధం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు యూనస్ మీడియా కార్యదర్శి షఫీకుల్ ఆలం ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. అవామీ లీగ్ రాజకీయ కార్యకలాపాలను ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. ఎన్నికల కమిషన్ ఆ పార్టీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేయడంతో



రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను ఆ పార్టీ కోల్పోయింది. అవామీ లీగ్ నాయకులపై ప్రస్తుతం అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. ఈ విచారణలు పూర్తయ్యే వరకు ఆ పార్టీపై నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అవామీ లీగ్‌పై నిషేధం విధించటంపై ఆందోళన వ్యక్తంచేస్తూ అమెరికాకు చెందిన పార్లమెంటు సభ్యులు బంగ్లా ప్రభుత్వానికి రాసిన లేఖపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు షఫీకుల్ ఆలం సమాధానం ఇచ్చారు. తాను ఆ లేఖ చూడలేదని, ఆ విషయం తనకు తెలియదని షఫీకుల్ ఆలం చెప్పారు. అవామీలీగ్ కార్యకలాపాలపై నిషేధం విధించటంతోపాటు ఎన్నికల సంఘం ఆ పార్టీ గుర్తింపును రద్దు చేసినందున వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

# పదవుల కంటే పార్టీ కార్యకర్తగా ఉండటమే ఇష్టం

**కర్ణాటక :** కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం, పదవుల కంటే పార్టీ కార్యకర్తగా ఉండటమే తనకు ఎంతో విలువనిస్తుం దన్నారు. 'అధికారం లేదా పదవి కంటే నేను పార్టీ కార్యకర్తగానే ఉండాలనుకుంటున్నాను. అది నాకు శాశ్వతం. అలా ఉండటమే నాకు ఇష్టం.



నేను 1980 నుంచి పార్టీ కార్యకర్తగానే ఉన్నాను. గత 45 ఏండ్లుగా నిరంతరం పార్టీ కోసమే కష్టపడి పనిచేస్తున్నాను' అని అన్నారు. ఢిల్లీలోని కరా?టక భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ డీకే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పదవికి సంబంధించి అధికార భాగస్వామ్య ఒప్పందం గురించి అడగ్గా.. 'మా మధ్య ఏం చర్చలు జరిగాయో నేను వెల్లడించలేను. రాష్ట్రంలో మేము కలిసి ఓ బృందంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. ఇందుకోసం పార్టీలోని ప్రతి కార్యకర్త తీవ్రంగా కృషి చేశారు. హైకమాండ్ మాకు స్వేఛనిచ్చింది. మాకు అండగా ఉంటున్న కరా?టక ప్రజలకు మేము రుణపడి ఉంటాము. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని డీకే వివరించారు.

# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

**న్యూఢిల్లీ:** ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. వీరిలో కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ కూడా హతమైనట్లు ప్రకటించారు. 2026 నాటికి దేశంలో నక్సలి జాన్ని సమూలంగా నిర్మూలిస్తామని అమిత్ షా మరోసారి ఉద్ఘాటించారు. ఒడిశాను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుస్తామని స్పష్టం చేశారు.



గురువారం నాడు ఒడిశాలోని కంధమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉనికి ఉన్నట్లు భద్రతా బలగాలకు సమాచారం అంది ంది. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు, ప్రత్యేక బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఓ చోట మావోయిస్టులకు, పోలీసులకు మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు అక్కడికక్కడే చనిపోయారు. మావోయిస్టుల వద్ద నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఆరుగురిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు౼క హనుమంతు అలియాస్ గణేష్ కూడా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం నిర్ధారించింది. కాగా, గణేష్ స్వస్థలం నల్లగొండ జిల్లాలోని చండూర్. గణేష్‌పై రూ. 1.10 కోట్ల రివార్డు ఉంది. గణేశ్ గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్నారు. హెూదాల్లో పనిచేసిన ఆయన మావోయిస్టుల బలం పెంచడం కోసం ఎంతో కృషిచేశారు.

# బైక్‌ను ఢీకొట్టిన రైలు ఇద్దరు పిల్లలతో సహా ఐదుగురు మృతి



**లక్నో:** రైల్వే క్రాసింగ్ వద్ద బైక్‌ను రైలు ఢీకొట్టింది. దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరు పిల్లలతో సహా ఐదుగురు ఈ ప్రమాదంలో మరణించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 24న సాయంత్రం వేళ ఇద్దరు పిల్లలతో సహా ఐదుగురు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్నారు. రౌజా రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ దాటుతుండగా లక్నో వైపు నుంచి వస్తున్న ప్యాసింజర్ రైలు ఆ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దానిపై ఉన్న ఇద్దరు పిల్లలతో సహా ఐదుగురు మరణించారు. కాగా, మృతులు లఖింపూర్ జిల్లాలోని వంకా గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. 40 ఏళ్ల సేథ్‌పాల్, 38 ఏళ్ల భార్య పూజ, నాలుగు, ఆరేళ్ల వయస్సున్న ఇద్దరు పిల్లలు, సేథ్‌పాల్ బావ అయిన 45 ఏళ్ల హరి ఓంగా మృతులను గుర్తించారు. నిగోహి గ్రామంలోని హరి ఓం ఇంటికి వెళ్లిన ఆ కుటుంబం ఆయనతో కలిసి వంకా గ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# జలాంతర్గామి నుంచి అణ్వాయుధ సామర్థ్యమున్న కే-4 క్షిపణి పరీక్ష



**న్యూఢిల్లీ:** భారత్ మరో కీలక క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. అణ్వాయుధ సామర్థ్యం ఉన్న కే-4 క్షిపణిని జలాంతర్గామి నుంచి ప్రయోగించింది. సుమారు 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే న్యూక్లియర్ మిస్సైల్‌ను న్యూక్లియర్ సబ్‌మెరైన్ నుంచి పరీక్షించారు. ఐఎన్ఎస్ అరిఘాట్ జలాంతర్గామి నుంచి కే-4 క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. విశాఖపట్నం తీరంలోని బంగాళాఖాతంలో అణుశక్తితో నడిచే జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాట్ నుంచి ఈ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ వర్గాలు మీడియాకు తెలిపాయి. అయితే అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. కాగా, గత ఏడాది ఐఎన్ఎస్ అరిఘాట్ జలాంతర్గామి నుంచి తొలిసారి కే-4 క్షిపణిని పరీక్షించారు. తాజాగా రెండోసారి ఈ మిస్సైల్ టెస్ట్ నిర్వహించారు. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) కే-4 క్షిపణిని అభివృద్ధి చేసింది. అణుశక్తితో నడిచే జలాంతర్గాముల్లో మోహరించేందుకు ఈ క్షిపణులను పరీక్షిస్తున్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..